నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
6 | ఆదివారం 20 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

చెన్నూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

చెన్నూర్, ఏప్రిల్ 19 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని నియోజకవర్గ స్థాయి నాయకుడు డాక్టర్ రాజా రమేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం చెన్నూర్ పట్టణంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. గోడలపై 'చలో వరంగల్' రాతలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, అందుకే ప్రజలు తిరిగి కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, మాజీ కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జోడు శంకర్, దోమకొండ అనిల్, వేల్పుల సుధాకర్, జగన్నాథుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, కొండపర్తి వెంకటరాజం, పెండ్యాల లక్ష్మణ్, అయిత సురేశ్‌రెడ్డి, కొప్పుల రవి, నయాబ్, నెన్నల భీమయ్య, జడల మల్లేశ్, పాసం అశీష్, బోగె భారతి, ప్రశాంత్‌రెడ్డి, రేవెల్లి రాజు, ధరణి రవిందర్, భూపాల లక్ష్మీనారాయణ, జల్లు, తాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకుడు రాజా రమేశ్

ఏడేళ్ల నిరీక్షణకు తెరపడేనా..!

ఎస్పీఎంలో జరగని గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు

- బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్పీ చొరవతో కదులుతున్న ప్రక్రియ
- చర్యలు చేపడుతున్న కార్మికశాఖ
- కార్మికుల్లో హర్షం

సిర్పూర్ పేపర్ మిల్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికల కోసం కార్మికులు ఏడేళ్లుగా నిరీక్షిస్తుండగా, త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తున్నది. ఇటీవల బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీఎం కార్మిక సంఘాల నాయకులతో కలిసి స్టేట్ లేబర్ కమిషనర్, జాయింట్ కమిషనర్‌ను కలిసి ఈ విషయమై చర్చించగా, వారు సానుకూలంగా స్పందించి.. చర్యలు చేపట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

కేసీఆర్ సర్కారు చొరవతో ..

1935లో నిజాం కాలంలో ఏర్పాటైన పేపర్‌మిల్లు విజయవంతంగా నడిచింది. దశాబ్దాల పాటు ప్రత్యక్షంగా.. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి చూపింది. ఈ క్రమంలో బ్యాంకుల్లో రుణాలు తీసుకొని తిరిగి కట్టని కారణంగా 2014 సెప్టెంబర్ 27న పేపర్ మిల్లు మూసివేతకు గురైంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ సర్కారు చొరవతో 2018లో అప్పటి మంత్రి కేటీఆర్ తిరిగి ప్రారంభించారు. మిల్లు ప్రారంభమైనప్పటి నుంచి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయితే, యాజమాన్యం సుముఖంగా లేకపోవడం వల్ల ఎన్నికలు జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి.

1978లో మొదటిసారి ఎన్నికలు..

సిర్పూర్ పేపర్ మిల్లులో 1978లో మొదటిసారి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరుగాయి. ఆపై రెండేళ్లకోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తూ వచ్చారు. చివరిసారిగా ఎస్పీఎంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు 2013లో నిర్వహించారు. ఆ తర్వాత 2014లో మిల్లు మూతపడింది. కేసీఆర్ సర్కారు కృషితో 2018 ఆగస్టులో జేకే యాజమాన్యం ఆధ్వర్యంలో మిల్లు తెరచుకున్నది. ఇక అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. గతేడాది ఆగస్టులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎస్పీఎం కార్మిక సంఘాల నాయకులు స్టేట్ లేబర్ కమిషనర్, జాయింట్ కమిషనర్‌ను కలిసి ఎస్పీఎంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని, త్వరగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఇందుకు కార్మిక శాఖ సానుకూలంగా స్పందించింది. మిల్లులో ప్రస్తుతం 13 కార్మిక సంఘాలు ఉన్నాయి. ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించేందుకు లేబర్ కమిషనర్ చర్యలు చేపట్టడంతో ఇటీవల వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కార్మిక శాఖ కార్యాలయంలో ఆయా సంఘాల రికార్డులను సమర్పించారు. త్వరలో ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తుండగా, ఇన్నేళ్ల నిరీక్షణకు తెరపడనున్నది.

కార్మికుల్లో హర్షం

ఎస్పీఎంలో ఏడేళ్లుగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించపోవడంతో యాజమాన్యం కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడిందనే ఆరోపణలున్నాయి. కనీసం క్యాంటీన్ కూడా ఏర్పాటు చేయకుండా అడ్డుకుందనే విమర్శలున్నాయి. కార్మికులు ఐక్యం కాకుండా యాజమాన్యం అడ్డుకున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చొరవతో ఎస్పీఎంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు కార్మిక సంక్షేమ శాఖ చర్యలు చేపడుతుండగా, కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఎన్నికలు త్వరగా నిర్వహించాలి

సిర్పూర్ పేపర్ మిల్లులో ఏడేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చొరవతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఆదిలాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేశ్వరిని ఎన్నికల అధికారిగా నియమించారు. ఇటీవల మా కార్మిక సంఘానికి సంబంధించి రికార్డులను ఆదిలాబాద్ లేబర్ కార్యాలయంలో సమర్పించాం. కార్మిక శాఖ అధికారులు ఎన్నికల ప్రక్రియను మరింత వేగవంతం చేసి త్వరగా నిర్వహించాలి. ఎస్పీఎం యాజమాన్యం చేతిలో కార్మికులు మోసపోకుండా, హక్కులను కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. *- అంబాల ఓదెలు, బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ విభాగం జిల్లా కన్వీనర్*

మంత్రి మీటింగ్‌కు ఎమ్మెల్యేలు డుమ్మా!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సమీక్షకు హాజరుకాని మంచిర్యాల శాసనసభ్యులు

- మొన్న సీఎల్పీ మీటింగ్‌కు దూరం.. నేడు మంత్రి సీతక్క సమావేశానికి గైర్హాజరు
- మంత్రి పదవి కోసం ఎవరి పట్టు వారిదే.. అందుకే సమావేశాలకు దూరం!

మంచిర్యాల, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవి రచ్చ కొనసాగుతూనే ఉన్నది. ఎమ్మెల్యేలు సమీక్షలు.. సమావేశాలు పక్కన పెట్టి పదవి దక్కించుకునే ప్రయత్నాల్లోనే ఉంటున్నట్లు తెలుస్తున్నది. శనివారం నిర్మల్ జిల్లాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించగా, మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు గైర్హాజరవడం చర్చనీయాంశమవుతున్నది. గతవారం మంచిర్యాలలో నిర్వహించిన మీటింగ్‌లో మినిస్టర్ పదవి విషయమై స్థానిక ఎమ్మెల్యే పీఎస్సార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అన్యాయం చేస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. ఆ కుటుంబంలో ఇప్పటికే మూడు పదవులు ఉన్నాయని, మరొకటి ఇస్తానంటే ఆదిలాబాద్‌కు అన్యాయం చేసినట్లేనని 'కాక' కుటుంబాన్ని ఉద్దేశించి మాట్లాడారు. అదే రోజు జైపూర్ మండలంలో జరిగిన ఓ సమావేశంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లిలో ఎమ్మెల్యే వినోద్ పీఎస్సార్ వ్యాఖ్యలను ఖండించారు. బీజేపీలో ఉంటే తాను కేంద్ర మంత్రిని అయ్యేవాడినని, సీఎం రేవంత్‌రెడ్డి పిలిస్తేనే పార్టీలోకి వచ్చానని వివేక్ తెలుపగా, 70 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే తమ కుటుంబం ఉందని.. సీనియర్‌గా మంత్రి పదవి అడగడంలో తప్పేమిటని వినోద్ చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయంశంగా మారిన నేపథ్యంలో గత మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీఎల్పీ మీటింగ్‌కు మంచిర్యాల ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. బెల్లంపల్లి ఎమ్మెల్యే ఆలస్యంగా ఆ రోజు మధ్యాహ్నం సీఎల్పీ సమావేశానికి వెళ్లినప్పటికీ వివేక్, పీఎస్ఆర్ మొత్తానికే గైర్హాజరయ్యారు. మంత్రి పదవి విషయంలో పరస్పర ఆరోపణలు, అధిష్టానంపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ ఇద్దరినీ సమావేశానికి పార్టీ పెద్దలు రావొద్దన్నారంటూ, ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు కావాలనే సమావేశానికి వెళ్లలేదనే ప్రచారం జరిగింది. ఈ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం ఇప్పటికే తన నిర్ణయాన్ని చెప్పలేదని, ఎమ్మెల్యేలెవరూ ఈ విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేయొద్దంటూ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తున్నది. మొన్నటి వరకు లోలోపల జరిగిన పోటీ.. పరస్పర వ్యాఖ్యల నేపథ్యంలో జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లాలో శనివారం ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై మంత్రి సీతక్క ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా, మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈ మీటింగ్‌కు గైర్హాజరవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పార్టీలో విబేధాలు తారా స్థాయికి చేరిన నేపథ్యంలో ఎమ్మెల్యేలు మీటింగ్ రాలేదనే చర్చ నడుస్తున్నది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ డిమాండ్
- కేకే-5గని మేనేజర్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

మందమర్రికేకే 5గని పై ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

మందమర్రి, ఏప్రిల్ 19: మందమర్రి ఏరియాలోని కేకే-5 గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గని మేనేజర్ కార్యాలయం ఎదుట కార్మికులతో బైఠాయించారు. ఏఐటీయూసీ మందమర్రి, బెల్లంపల్లి బ్రాంచ్‌ల కార్యదర్శులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేశ్ మాట్లాడుతూ గని మేనేజర్ కార్మికుల సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, పని భారం పెంచి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ఆయన తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గతేడాది అధికారులు, కార్మికుల సమన్వయంతో 100 శాతానికి పైగా బొగ్గు ఉత్పత్తి సాధించామని, అయినప్పటికీ మేనేజర్ కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నిరూపణలో సీసీ కెమెరాలు కీలకం

బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రి, ఏప్రిల్ 19: నేరాల నిరూపణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అన్నారు. మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీలో కాలనీ వాసుల సహకారంతో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఉపయోగంపై ఆయన స్థానికులకు అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కాలనీవాసులు, అందుకు కృషి చేసిన మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌ను ఆయన అభినందించారు. సీసీ కెమెరాలున్న ప్రాంతంలో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదన్నారు.

మందమర్రిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ రవి కుమార్

బాబోయ్ ఎండ

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భానుడు ఉగ్రరూపం దాల్చగా, రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. శనివారం గరిష్ఠంగా 42.3 డిగ్రీలు నమోదు కాగా, ఉదయం తొమ్మిదింటి నుంచి సాయంత్రం దాకా ఎండ తీవ్రత కనిపించింది. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దహెగాం మండలం కేంద్రంలోని మార్కెట్ ఏరియా జన సంచారం లేక నిర్మానుష్యంగా మారింది. స్థానికుడు రాపర్తి ధనుంజయ్ మినరల్ వాటర్ సౌకర్యం కల్పించగా, వివిధ పనులపై వచ్చిన వారంతా దాహం తీర్చుకున్నారు. - దహెగాం, ఏప్రిల్ 19

ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా

మానని గాయానికి 44 ఏండ్లు

నేడు ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నివాళులర్పించేందుకు సిద్ధమైన ఆదివాసులు

ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్మారక స్తూపం

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 19 : ఇంద్రవెల్లి ఘటనకు నేటి(ఆదివారం)తో 44 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రపంచ చరిత్రలో నిలిచిన ఏప్రిల్ 20, 1981 రోజును ఆదివాసీ గిరిజనులు ఎన్నటికీ మరువరు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమరవీరుల సంస్మరణ దినోత్సవం సభను అధికారికంగా నిర్వహించేందుకు ఐటీడీఏ ద్వారా ఏర్పాట్లు పూర్తి చేయడంతో ఉమ్మడి జిల్లా ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజనులతోపాటు అమరవీరుల కుటుంబ సభ్యులు తరలిరానున్నారు.

ఆ రోజు జరిగిందిలా..

జల్, జంగల్, జమీన్ కోసం ఉద్యమించిన అడవిబిడ్డలపై అప్పటి సర్కారు తుపాకీ గురిపెట్టి తూటాల వర్షం కురిపించింది. పోలీసులు విచక్షణా రహితంగా కాల్పుల జరపడంతో అనేక మంది గిరిపుత్రులు అసువులు బాశారు. ఆ రక్తపు మరకలు ఇప్పటికీ చెరిగిపోలేదు. 44 ఏళ్ల క్రితం గిరిజనులు, వ్యాపారులు అధికారుల చేతుల్లో అనేక రకాలుగా దోపిడీకి గురయ్యారు. గిరిజను లు నోరువిప్పితే చాలు అధికారులు చావబాదేవారు. ఈ క్రమంలో నక్సలైట్ల ఉద్యమం విస్తరిస్తుంది. వారిని అణచి వేయడానికి గిరిజన గూడేల్లో పోలీసుల బూట్ల చప్పుళ్లు ప్రారంభమయ్యాయి. అష్టకష్టాలు పడుతున్న గిరిజనులు ఎవరు పోరాటం చేసినా కలిసిరావడానికి సన్నద్ధమయ్యారు. ఈ తరుణంలో నక్సలైట్లు భూ పంపిణీ చేయాలని అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో గిరిజనులు అడవుల్లో ఖాళీగా ఉన్న భూములను దున్నడం ప్రారంభించారు. అయిన అప్పటి ప్రభుత్వం స్పందించకపోవడంతో పలు సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి 1981, ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దీనికి అప్పటి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయిన వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని గిరిజన సంఘాలు ప్రకటించాయి.

ఏప్రిల్ 20, 1981న జరిగిన ఘటన

ఏప్రిల్ 20, 1981న సోమవారం ఉదయం నలుదిక్కుల నుంచి గిరి జనులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు ఇంద్రవెల్లి అంతా గిరిజనులతో నిండింది. సమావేశం జరగకుండా పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. వాహనాలు రాకుండా రహదారులను దిగ్బంధించారు. గిరిజనులను చూసిన పోలీసుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. సభాస్థలానికి గిరిజనులు ర్యాలీగా బయలుదేరారు. అప్పటి ప్రభుత్వం తాడోపేడో తేల్చుకోవాలని కసితో ఉంది. వేలాదిమందితో వస్తున్న గిరిజనుల ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఓ జవాన్ గిరిజన యువతితో అసభ్యంగా ప్రవర్తించాడు. ప్రాణం కంటే శీలం ముఖ్యమనుకున్న ఆ యువతి జవాన్‌పై చేతిలో ఉన్న ఆయుధంతో దాడి చేసింది. అంతే.. ఆ జవాన్ నేలకొరిగాడు. దీంతో పరిస్థితి చేయిదాటి పోవడంతో పోలీసులు తుపాకులకు పని చెప్పారు. తుపాకుల శబ్దంతో ఇంద్రవెల్లి దద్దరిల్లింది. గిరిజనులపై పోలీసులు తూటాల వర్షం కురిపించారు. దీంతో వందలాది మంది గిరిజనులు నేలకొరిగారు. చుట్టూ పక్కల పచ్చని చెట్లు ఎర్రగా మారాయి. గోండుల రక్తం భూమిపై ఏరులై పారింది. ఎటు చూసినా ఎర్రని రక్తపు మడుగులు కనిపించాయి. వందలాది మంది గిరిజనులు అరుపులు, కేకలతో వాగుల వెంట పరుగులు తీశారు. కానీ.. సీమాంధ్ర పాలకులు బాధితులకు ప్రభుత్వపరంగా సంతృప్తికరమైన సాయం అందించలేదు. దీంతో వారు దుర్భార జీవితాలు గడుపుతున్నారు. కాల్పుల ఘటన సాక్షిగా ఇంద్రవెల్లి సమీపంలోని హీరాపూర్ గ్రామం వద్ద అమరవీరులు స్తూపం ఏర్పాటు చేశారు. యేటా ఏప్రిల్ 20న అమరవీరులకు ఆదివాసీ గిరిజనులు వారి సంప్రదాయం ప్రకారం ఘనంగా నివాళులర్పిస్తూ అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నారు.

అధికారికంగా ఏర్పాట్లు

అమరవీరుల సంస్మరణ దినోత్సవ సభ నిర్వహణ కోసం ఉట్నూర్ ఐటీడీఏ ద్వారా అధికారికంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. 150 మందితో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివాసీ గిరిజనులు స్వేచ్ఛగా నివాళులర్పించుకోవచ్చన్నారు. అమరవీరుల స్తూపం వద్ద పోలీసుల ఎలాంటి ఆంక్షలు విధించలేదు.

అమరులు వీరే..

పిట్టబొంగురం గ్రామానికి చెందిన మడావి రాము, వడగాంకు చెందిన కనక సోము, కోయల్‌పాండ్రికు చెందిన తోడసం భీంరావ్, గౌరాపూర్‌కు చెందిన హెరే కుమ్రం జగ్గు, బోథ్ మండలంలోని సాంగ్వి(కౌట)కు చెందిన మండాడి జంగు, ఇంద్రవెల్లి మండలంలోని డోంగర్‌గాంకు చెందిన కోవా రాము, గౌరాపూర్‌కు చెందిన సిడాం బాపురావ్, తాటిగూడకు చెందిన సెడ్మకి కోద్దు, (మోహన్‌గూడ) తేజాపూర్‌కు చెందిన అర్కా గంగు, గౌరాపూర్‌కు చెందిన మంగం ముత్తు, పిట్టబొంగురంకు చెందిన కోట్నాక్ గంగు, సిరికొండ మండలంలోని నిజామ్‌గూడకు చెందిన పెందూర్ భీంరావ్, పాండుగూడకు చెందిన పెందూర్ మచ్చు, పాండుగూడకు చెందిన పెందూర్ గంగారాం, సోన్‌పల్లికు చెందిన పెందూర్ సుంగులు పోలీసుల కాల్పులో మృతి చెందినారు.